క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబుల దిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు, సుద్దమల్ల గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీ నరసింహ కంబగిరిస్వామికి అభిషేకాలు, కుంకుమార్చన, ఆకు పూజలతో పాటు ప్రత్యేక పూజలు చేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు లక్ష్మణ స్వామి, భాస్కరశర్మ, అనంతయ్య, కమలేష్‌శర్మలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఉపాధి హామీ పథకంలో వివిధ స్థాయిలో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం పట్టణంలోని ఎస్పీజీ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఎన్ఆర్ఐజీఎస్ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నిర్వాహక కమిటీ సభ్యులు మనోహర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు నాగేంద్రుడు, స్పెషల్ ఐటీడీఏ ఆఫీసర్ కత్రావత్ గుండాలనాయక్, ఐటీడీఏ అధికారి ఏసుదాసు, డ్వామా రీజనల్ సెక్రటరీ రాజేష్, దళిత సంఘాల నాయకులు మేకల లింగస్వామి ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న షేక్షావలిరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు నంద్యాల పట్టణానికి చెందిన గురురాజ స్కూల్ విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలిరెడ్డి శనివారం తెలిపారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు నంద్యాల ఇండోర్ స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో అండర్–14 ఫెన్సింగ్ విభాగంలో గురురాజ పాఠశాల విద్యార్థి ఓజో రంగసాయి బంగారు పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

నంద్యాలలో శిక్షణా తరగతులు ఏర్పాటు చేయాలి


ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న టీచర్స్ యూనియన్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని నంద్యాల జిల్లా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఎంపీ బైరెడ్డి శబరికి వినతి పత్రం అందజేశారు. నాయకులు జాకీర్‌హుసేన్, రామచంద్రారెడ్డి, శివయ్య, భాస్కరరెడ్డి మాట్లాడుతూ 400 కి.మీ. దూరంలోనున్న హిందూపురంలో జరిగే ఎఫ్ఎల్ఎన్ శిక్షణకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. నంద్యాల నుంచి 150మంది ఉపాధ్యాయులను శిక్షణ వెళ్లాలని ఆదేశించారని, అక్కడ కాకుండా జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందని చెప్పారు. దస్తగిరిబాషా, వీరేశ్వరరెడ్డి, రాజ్‌కుమార్, ఆదినారాయణ, పుల్లయ్య, శైలజ, జానిబాషా, శివలింగమయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు


కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ : జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రాథమిక పాఠశాల (ఉర్దూ)లో శనివారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆదేశాల మేరకు ఆప్తాలిమిక్ అధికారి సాత్రి రమేష్ సుమారు 150 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ఇందులో ఆరుగురు విద్యార్థులకు కళ్ల అద్దాలకు సిఫారసు చేశారు.

ఎంవీఆర్పీఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా శ్రీనివాసులు

ఆళ్లగడ్డ : నియోజకవర్గ మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి (ఎంవీఆర్పీఎస్) అధికార ప్రతినిధిగా శ్రీనివాసులను ఎన్నుకున్నట్లు ఎంవీఆర్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు జయరామ్, మదనగోపాల్ శనివారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షులు నారాయణ ఉన్నారు

సిబ్బంది లేక.. సేవలు అందక

- ముత్యాలపాడు–1 గ్రామ సచివాలయంలో సిబ్బంది కొరత
- ఉన్నవారు బదిలీ
- కొత్తవారినికి నియమించని ప్రభుత్వం
- పనులు కాక గ్రామప్రజలకు ఇబ్బంది


సచివాలయంలో ఖాళీగా ఉన్న డిజిటల్ అసిస్టెంట్ సీటు

చాగలమర్రి: గ్రామ స్థాయిలో ప్రజలకు సుపరిపాలనను అందించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఖాళీగా ఉన్న పలు పోస్టులను భర్తీ చేయకపోగా.. బదిలీ అయిన స్థానాల్లో కొత్తవారిని నియమించకపోవడంతో ప్రజలకు సేవలందడం లేదు.

సిబ్బంది బదిలీ..

మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన సచివాలయంలో సిబ్బంది లేకపోవడంతో గ్రామ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ముత్యాలపాడు గ్రామంలోని 1వ సచివాలయానికి చెందిన డిజిటల్ అసిస్టెంట్ హేమంత్‌రెడ్డి ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో కోవెలకుంట్లకు వెళ్లగా.. అతని స్థానాన్ని అధికారులు భర్తీ చేయకపోవడంతో ఈ పోస్టు ఖాళీగా ఉండిపోయింది. అంతేకాకుండా వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీలక్ష్మి, మహిళా పోలీసు చన్నీలు మెటర్నిటీ సెలవుల్లో వెళ్లారు. మొదటి నుంచి ఏఎన్ఎం పోస్టు ఖాళీగానే ఉంది. గ్రామ ప్రజలు ఆధార్‌కార్డు నమోదు చేయించుకోవాలన్నా, అడ్రసు మార్పు చేసుకోవాలన్నా, పేర్లలో తప్పులను సరిదిద్దుకోవాలన్నా డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఒక్కరికే మూడు సచివాలయాల బాధ్యతలు

సచివాలయంలో గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఎం.ఫైరోజా బదిలీపై మండలంలోని కలుగొట్లపల్లె గ్రామానికి వెళ్లారు. అయితే ముత్యాలపాడు సచివాలయంలో బీఎల్ఓగా, డి.వనిపెంట సచివాలయంలో ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి, డీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆమె 3 సచివాలయాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించవలసి వస్తోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ముత్యాలపాడు 1వ సచివాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కారం కావడం లేదు



కుటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి గ్రామంలోని సచివాలయంలో సిబ్బంది కొరత ఏర్పడింది. ప్రతి పనికి ఆధార్ కార్డు, రేషన్ కార్డు అవసరమవుతుంది. కార్డులో తప్పులు దొర్లడంతో సరిదిద్దుకోవడానికి డిజిటల్ అసిస్టెంట్ లేక ఇబ్బందులకు గురవుతున్నాం. కొన్ని నెలలుగా సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేరు, అయినా గ్రామంలో అధికార పార్టీ నాయకులు పట్టించుకోవడం లేదు.
– పెద్ద ఓబయ్య, ముత్యాలపాడు గ్రామం

పీఎం కిసాన్ ఖాతాలో జమ కాలేదు



ముత్యాలపాడు రెవెన్యూలో నాకు భూమి ఉంది. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చే పీఎం కిసాన్ ప థకం ద్వారా మంజూరు చేసే నగదు ఖాతాలో జమా కాలేదు. కారణం తెలుసుకునేందుకు సచివాలయానికి వస్తే సమాధానం చెప్పేవారు లేరు.దీంతో సచివాలయం చుట్టూ తిరగవలసి వస్తోంది.– రైతు పాలూరు భికారి, బాచేపల్లె గ్రామం

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న పట్టణ సీఐ చిరంజీవి

ఆళ్లగడ్డ : సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణ సీఐ చిరంజీవి అన్నారు. శనివారం రాత్రి పట్టణ శివారులోని సద్దాం కాలనీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దన్నారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదని చెప్పారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. కాలనీలో ఉన్న కుటుంబాలు అందరు కలిసి మెలసి ఉండలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు నగీన, జయప్పలు ఉన్నారు.

ముగిసిన 'పల్లె పండుగ'


ఉయ్యాలవాడలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : ఈ నెల 14న మండలంలో ప్రారంభమైన పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ నెల మొదటి వారంలోనే రబీ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన గ్రామీణులకు ఏ మాత్రం సమాచారం ఇవ్వకుండా, ప్రచారం నిర్వహించకుండా అధికారులు తూతూ మంత్రంగా వారోత్సవాలు జరిపించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. కూటమి నేతల హడావుడి తప్పా వారోత్సవాల్లో స్థానికులు అరకొరగా మాత్రమే పాల్గొన్నారు. చివరి రోజు మండల కేంద్రంలోని ఉయ్యాలవాడలో నాలుగు పనులకు సంబంధించి రూ. 28 లక్షలతో జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిర్మించనున్న సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఏఈ వెంకటయ్య, ఈఓపీఆర్‌డి వెంకటేశ్వర్లు, సర్పంచ్ మేకల ఓబులేస్, ఎంపీటీసీ సభ్యులు గగ్గెర వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల గ్రామానికి చెందిన సలిపెల దస్తగిరిరెడ్డి అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన షకూర్‌బాషా, చాంద్‌బాషాలు దాడి చేసి గాయపరచిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు ఇంటి వద్ద మురుగు నీటి కాలువ విషయంలో ఘర్షణ చోటుచేసుకుంది. మహిళలను దుర్భాషలాడుతుండగా అడ్డుకునేందుకు వెళ్లిన దస్తగిరిరెడ్డిపై రాయితో దాడి చేయడంతో చేతికి రక్తగాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్పష్టం చేశారు.

ప్రభుత్వ ఆస్తుల రక్షణకు ఉద్యమిస్తాం


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ స్థలాలు కాపాడే బాధ్యత ఎవరిది? అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులదా?అధికారులదా? సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడుకుందామంటూ శనివారం నంద్యాల పట్టణంలోని సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో స్వామిరెడ్డి భవన్‌లో ప్రసాద్ అధ్యక్షతన రౌండేటేబుల్ సమావేశం నిర్వహించారు. రంగనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను కాపాడటానికి ఉద్యమిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చింతలయ్య, ఇస్లాం హిందూ అధ్యక్షుడు అబ్దుల్‌సమ్మద్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉపయోగించాలే తప్ప ఏ పార్టీ అధికారంలో ఉంటే వారి అనుచరులకు ప్రభుత్వ ఆస్తులను దారదత్తం చేయడం తగదన్నారు. ప్రభుత్వ ఆస్తులను కబ్జాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడుకునేందుకు వామపక్ష రాజకీయ పార్టీలు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్‌బీఐ కాలనీలోనున్న ప్రభుత్వ స్థలాలను ప్లాట్లుగా వేసి అమ్ముతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. సోమన్న, ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు చౌడప్ప, ముస్లిం జేఏసీ గౌరవాధ్యక్షుడు మహమ్మద్ అబులైజ్, అఖిల భారత రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్, పీడీఎస్‌యూ రాంబాబు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు స్థలాలు కేటాయించాలి


మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతి పత్రం ఇస్తున్న చిరువ్యాపారులు

నంద్యాల(అర్బన్): స్ట్రీట్ వెండర్స్ వెల్ఫేర్ యాక్ట్ ప్రకారం చిరు వ్యాపారులకు ప్రభుత్వమే వ్యాపారం చేసుకునేందుకు స్థలాలు కేటాయించాలని చిరు వ్యాపారుల సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఆకుమల్ల రహీం అన్నారు. నంద్యాల చిరువ్యాపారుల సంక్షేమానికి తోడ్పాటునివ్వాలని కోరుతూ శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసాకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారులు వ్యాపారాలు చేస్తుంటే అధికారులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, చిరువ్యాపారుల సంక్షేమానికి సహకరించాలని కోరారు. స్ట్రీట్ వెండర్ వెల్ఫేర్ యాక్ట్‌పై చిరువ్యాపారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. నాయకులు సత్యనారాయణ, సిద్ధయ్య, అన్వర్, దస్తగిరి పాల్గొన్నారు.

ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): రాయలసీమ యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యంతో బీఈడీ పరీక్ష వాయిదా పండిందని, అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర యూనివర్సిటీల కన్వీనర్ ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 23 నుంచి బీఈడీ 1వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయన్నారు. 17 కేంద్రాల్లో 4,500 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. శుక్రవారం ఇన్‌ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఎర్నింగ్ టీచింగ్ అండ్ లెర్నింగ్ పరీక్ష జరగాల్సి ఉందన్నారు. మధ్యాహ్నం 2గంటలకు పరీక్ష ప్రారంభం కావాల్సి ఉండగా 1.50 గంట సమయంలో పరీక్షను 30వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు అధికారులు తెలపడంతో అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం తగదన్నారు. సమర్థవంతంగా పరీక్ష నిర్వహించలేని అధికారులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎస్ఐ

దొర్నిపాడు: ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ వెంకటేష్ సూచించారు. పోలీసులు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానికి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు శనివారం బహుమతులు అందజేశారు. పదో తరగతి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. చట్టాలు వాటి అమలు వంటివాటిపై తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు ఉపాధ్యాయుడు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వరి విత్తనాలు ఉత్పత్తి చేయాలి


మాట్లాడుతున్న ఏఓ ప్రసాదరావు

నంద్యాల(అర్బన్): నాణ్యమైన వరి విత్తనాలు తయారు చేయాలని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని బిల్లలాపురం గ్రామంలో శనివారం గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల్లో వరి పూత, గింజ పాలు పోసుకొనే దశలో ఉందని, రైతులు నాణ్యమైన విత్తనోత్పత్తికి కృషి చేయాలన్నారు. కోత, ఆరబెట్టే సమయాల్లో ఇతర కేళీలు కలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో శాస్త్రవేత్త రమాదేవి, ఏఈఓలు, వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.


కార్యాలయంలో భద్రపరిచిన టైప్ మిషన్, ల్యాండ్‌ఫోన్

జ్ఞాపకాలు భద్రంగా..

దొర్నిపాడు: ఒకప్పుడు ప్రభుత్వ కార్యాలయాల్లో వాటికి ఎనలేని ఆదరణ ఉండేది. చాలా ఏళ్లు ప్రజలకు, అధికారులకు మంచి సేవలను అందించాయి. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోవడంతో సులువుగా సేవలందించే కంప్యూటర్, సెల్‌ఫోన్ వంటి పరికరాలు అందుబాటులోకి రావడంతో టైప్ మిషన్, ల్యాండ్ ఫోన్‌లు జ్ఞాపకాలుగా మిగిలిపోవడంతో అధికారులు వాటిని భద్రంగా దాచారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వీటిని అలాగే భద్రపరిచారు.


జిల్లెల్ల కుంటను కప్పేసిన గుర్రపుడెక్క

అల్లుకుపోయిన గుర్రపుడెక్క

గోస్పాడు: మండలంలోని జిల్లెల్ల గ్రామ కుంటలో గుర్రపుడెక్క అల్లుకుపోయింది. కురుస్తున్న వర్షాలకు కుంట పూర్తిస్థాయిలో నిండింది. గ్రామంలోని ప్రజలు తమ అవసరాలకు కుంట నీటిని వినియోగిస్తారు. గుర్రపుడెక్క పరుచుకుపోవడంతో నీరు సరిగా కనిపించడం లేదు. పూర్తిస్థాయిలో పంట చేనులా కనిపిస్తోంది. నీటి కోసం వెళ్లే వారు అజాగ్రత్తగా ఉంటే ప్రమాదం చోటు చేసుకునే అవకాశముందని అధికారులు స్పందించి గుర్రపుడెక్కను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


పంట పొలాన్ని తలపిస్తున్న గుర్రపుడెక్క


అంగన్‌వాడీ కేంద్రం వెనక ఉన్న నీటికుంట

భరించలేని దుర్గంధం

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ సచివాలయం సమీపంలో ఉన్న నీటికుంట ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నిండిపోయింది. నీరు నిల్వ ఉండటం, చెత్తా చెదారం చేరడంతో, నాచు పెరిగిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు, చుట్టుపక్కల వారు దుర్వాసనను భరించ లేక ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక విషపురుగులు కూడా సంచరిస్తున్నట్లు చెబుతున్నారు. అధికారులు స్పందించి నీటిని తొలగించాలని కోరుతున్నారు.

ముగిసిన గ్రామసభలు

దొర్నిపాడు: మండలంలో గ్రామసభలు శనివారంతో ముగిశాయి. చివరిరోజు డబ్ల్యూ కొత్తపల్లె, డబ్ల్యూ గోవిందిన్నె గ్రామాల్లో సభలు నిర్వహించారు. రెండు గ్రామాల్లో భూ సమస్యలపై 152 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సుభద్ర తెలిపారు. కార్యక్రమంలో డీటీ మాధవ్, మండల సర్వేయర్ నాగప్రసాద్, గ్రామ సర్వేయర్ వందన, వీఆర్ఓలు ప్రవీణ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: మండలంలోని మహదేవపురం, గుండంపాడులలో శనివారం గ్రామ సభలు జరిగాయి. భూముల విస్తీర్ణం, సర్వేపై రైతులు 75 అర్జీలు తహసీల్దార్ పుష్పకుమారికి అందజేశారు. కార్యక్రమంలో రీ– సర్వే డీటీ మహబూబ్‌బాషా, సర్వేయర్ చిన్న మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దకంబలూరులో 105 దరఖాస్తులు

రుద్రవరం: పెద్దకంబలూరు రెవెన్యూ గ్రామసభలో రైతుల నుంచి 105 దరఖాస్తులు అందినట్లు తహసీల్దారు మల్లికార్జునరావు తెలిపారు. మండల పరిధిలోని పెద్దకంబలూరులో శనివారం అధికారులు రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలోని రైతులు తమ సమస్యలపై దరఖాస్తులు అందించారు. వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ రమణ, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

గ్రామసభకు 73 దరఖాస్తులు

గోస్పాడు: మండలంలోని పసురపాడు గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామ సభకు 73 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ షేక్ మొహిద్దీన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం భూముల రీ సర్వే నిర్వహించిందని అందులో విస్తీర్ణంలో తేడాలకు సంబంధించి 36, కొరిలేషన్‌కు 18, పట్టాదారు పాసుపుస్తకాలకు 1, జాయింట్ ఎల్‌పీఎం సమస్యలకు 17, ఇతర సమస్యలకు 1 చొప్పున రైతులు దరఖాస్తులు అందజేశారని చెప్పారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి

నంద్యాల(అర్బన్): మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు కోరారు. శనివారం గుంతనాల గ్రామంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్బంగా 38 మంది రైతులు దరఖాస్తులు అందజేశారు. అనంతరం డీటీ మాట్లాడుతూ భూ సర్వేతో రిజిస్టర్లు కాని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి భూముల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఐటీడీఏ పరిశీలన

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంలోని ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఐటీడీఏ)ని నంద్యాల కలెక్టర్ జి.రాజకుమారి శనివారం సందర్శించారు. ఐటీడీఏ పనితీరుపై ఆరా తీశారు. చెంచు గిరిజనులకు అందుతున్న సంక్షేమ పథకాలు, వాటి అమలు తీరు, ఆర్ఓఎఫ్ఆర్ కింద పట్టాలు పొందిన గిరిజనులకు అందుతున్న సహకారంపై ఇన్‌చార్జ్ పీఓ సురేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు.

పంట కోత ప్రయోగాలతో ప్రయోజనం


మొక్కజొన్న పంట ప్రయోగాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

శిరివెళ్ల: పంట కోత ప్రయోగాలతో పలు ప్రయోజనాలున్నాయని జిల్లా వ్యవసాయాధికారి మురళీ కృష్ణ అన్నారు. శనివారం గోవిందపల్లెలో మొక్కజొన్న పంటలో కోత ప్రయోగాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా తమ శాఖ ఎంపిక చేసిన పొలాలలో పంట కోత ప్రయోగాలను చేస్తుందన్నారు. విత్తన సాగుకు ముందు కొంత మంది రైతులను ఎంపిక చేసుకొని పంట పండిన అనంతరం ఆ పొలాలలో పంట కోత ప్రయోగాలు చేస్తున్నారన్నారు. దీనివలన ఆ గ్రామంలో ఏఏ పంట ఎంత దిగుబడి వచ్చిందని తెల్సుకోవచ్చన్నారు. సాధారణంగా రావాల్సిన దిగుబడి రాక పోతే ప్రభుత్వానికి నివేదికలను పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్, బీమా ఏజంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.